క్లుప్తంగా

కె.కె.రాజుకు శారదా పీఠాధిపతి ఆశీస్సులు



వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు గురువారం చినముషిడివాడలోని శారదా పీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆశీర్వాదం తీసుకున్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నామినేషన్ వేయనున్న సందర్భంగా తన నామినేషన్ పత్రాలను అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేశారు. – సీతమ్మధార

ఆర్పీపై ఆర్వోకు ఫిర్యాదు



రిటర్నింగ్ అధికారి అఖిలకు ఫిర్యాదు చేస్తున్న నీలాపు కాళీదాస్‌రెడ్డి

సీతమ్మధార: టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పి.వి ష్ణుకుమార్‌రాజు ఎన్నికల ప్రచారంలో 44వ వార్డు అవుట్ సోర్సింగ్‌లో ఆర్పీగా పనిచేస్తున్న అలివేణి నిబంధనలు ఉల్లంఘించి పాల్గొన్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ నీలాపు కాళీదాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఉత్తర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.అఖిలకు లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు ఇమంది ప్రసాద్‌తో కలిసి ఆయన ఫిర్యాదు చేశారు.

జగన్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



53వ వార్డులో కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

మద్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసి అండగా నిలిచారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా గురువారం జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం, జాకీర్‌హుస్సేన్‌నగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో నిషాని వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం కాసేపు ముస్లిం పెద్దలతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అన్ని రంగాల వారికి సమన్యాయం చేసి సుపరిపాలన అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ఐదేళ్లుగా పరిపాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం మనందరికీ ఉందన్నారు. తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా అవకాశమివ్వాలని, ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతూ కె.కె.రాజు కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, షేక్ బాబ్జి, హనుమంతు, రామలక్ష్మి, వలీ తదితరులు పాల్గొన్నారు.

కె.కె.రాజుకు ఎస్సీ, ఎస్టీ నాయకుల మద్దతు



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు



కె.కె.రాజుకు మద్దతు తెలుపుతున్న అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ప్రతినిధులు

సీతమ్మధార: మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాయలంలో గురువారం నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి విలువిస్తూ ఆయన ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, దళిత వర్గాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అన్ని పదవుల్లో వారికి సముచిత స్థానం కల్పించారని చెప్పారు. అనంతరం కె.కె.రాజును ఎస్సీ, ఎస్టీ నాయకులు భారీ మాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ, మాజీ కార్పొరేటర్ పామేటి బాబ్జీ, ఎస్సీ నాయకులు సొండి సురేష్‌కుమార్, గోవింద్, బద్రి, బంగారు లక్ష్మీనారాయణ, స్వర్ణమణి కాంతారావు, జగ్జీవనరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ మద్దతు

సీతంపేట: రామాటాకీస్ సమీపంలోని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (ఏఎంఎస్) సభ్యులు వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మద్దతు తెలిపారు. ఆయనను భవనానికి ప్రత్యేకంగా ఆహ్వానించి, రానున్న ఎన్నికల్లో విజయానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన నాయీ బ్రాహ్మణులు



ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయీ బ్రహ్మణులు

సీతమ్మధార: జీవీఎంసీ 98వ వార్డుకు చెందిన నాయీ బ్రాహ్మణులు వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు(అవంతి) సమక్షంలో ఆ పార్టీలో చేరారు. సీతమ్మధారలోని ఆయన నివాసంలో గురువారం ముత్తంశెట్టిని నాయీ బ్రాహ్మణులు కలిశారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా అవంతి గెలుపే లక్ష్యంగా బాధ్యతతో పనిచేస్తామని నాయీ బ్రాహ్మణులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టిని వారు గజమాలతో సత్కరించారు.

మొదటి రోజు రెండు నామినేషన్లు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదలవడంతో నామినేషన్ల హడావుడి ప్రారంభమైంది. మొదటి రోజు ఉత్తర నియోజకవర్గం నుంచి ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నవ్ భారత్ నిర్మాణ్ సేవ పార్టీ తరఫున కంచరపాలేనికి చెందిన చింతాడ సూర్యం(ఎస్సీ–బీ), జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి పి.జగదీష్ వారి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.అఖిలకు అందజేశారు.

సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వీటిని ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.రమేష్ నేతృత్వంలో ఎస్ఐ ధర్మేంద్ర, సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ పర్యవేక్షించారు.


విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: జోన్–2 డివిజన్ మద్రిపాలెం సెక్షన్ పరిధి మద్రిపాలెం, 104 ఏరియా, బాపూజీనగర్ 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మహారాణి వీధి, మద్రిపాలెం మెయిన్ రోడ్డు, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, శ్యామ్‌నగర్ కాలనీ, సిద్ధార్థనగర్, భవానీ గార్డెన్స్, బాపూజీనగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మురళీనగర్ పరిధిలో..

మురళీనగర్ సెక్షన్ పరిధి మురళీనగర్ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు తెన్నేటినగర్, బాలభాను పాఠశాల ఏరియా, స్పెన్సర్స్ ఏరియా, మురళీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమించాలని ఈఈ బీకే నాయుడు కోరారు.

నేడే కె.కె.రాజు నామినేషన్



వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఈ నెల 19న ఎన్నికల నామినేషన్ వేయనున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఎన్‌జీజీవోఎస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర ఆలయంలో స్వామిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆలయం వద్ద నుంచి సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, డీఎల్‌బీ గ్రౌండ్, ఇనార్బిట్ మాల్, పోర్ట్ హాస్టల్ సిగ్నల్, అక్కయ్యపాలెం ఎన్‌హెచ్–5 సిగ్నల్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ జంక్షన్ మీదుగా బైక్ ర్యాలీ చేస్తూ బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయానికి చేరుకుంటారు. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా పాదయాత్ర చేసుకుంటూ అభయ ఆంజనేయ స్వామి ఆలయం, ఎస్ఎఫ్ఎస్ స్కూల్, అల్లూరి సీతారామరాజు విగ్రహం, ఆక్సిజన్ టవర్స్ మీదుగా సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తన నామినేషన్ దాఖలు చేస్తారు.

ఉత్తమ విద్యార్థులకు ఈకార్వో స్కాలర్‌షిప్స్



స్కాలర్‌షిప్స్ అందుకున్న విద్యార్థులతో ఈకార్వో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లు, సభ్యులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న రైల్వే ఉద్యోగుల పిల్లల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్స్ అందజేశారు. రైల్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 2023లో టెన్త్, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులతోపాటు ఐఐటీ, నీట్, ఇంజినీరింగ్ వంటి వివిధ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సుమారు 40 మంది విద్యార్థులకు ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలతోపాటు ఉపకార వేతనాలు అందించి అభినందించారు. ఈకార్వో వైస్ ప్రెసిడెంట్లు కవితా గుప్తా, మధుస్మిత సాహూ, సెక్రటరీ అంకిత శర్మ, ఇతర సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 264 మంది రోగులకు వైద్యులు సేవలందించారు. నిపుణులైన డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి తగు సూచనలిచ్చి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.సాధారణ, కంటికి సంబంధించి ఇద్దరిని రిఫరల్ చేశారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



శ్రీరామ పట్టాభిషేకంలో పాల్గొన్న సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతులు

సీతంపేట: వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పార్వతీశ్వరాలయం వద్ద శ్రీరామ పట్టాభిషేకం వైభవోపేతంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్టు సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్య కలశాలతో వేదమంత్రాల మధ్య సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుల పంచలోహ విగ్రహాలకు పట్టాభిషేకం జరిపించారు. ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలదండలతో అలంకరించి వెండికిరీటాలు ధరింపజేశారు. ఈ సందర్భంగా అర్చకులు భాస్కరశర్మ, శివాజీశర్మ సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం విశిష్టతను భక్తులకు వివరించారు

ఘనంగా ముత్యమాంబ జాతర

కంచరపాలెం: గవర కంచరపాలెం ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండగను గ్రామాభ్యుదయ సంఘం గ్రామాధ్యక్ష, కార్యదర్శులు దాడి సూర్య అప్పారావు, మళ్ల శంకరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం మెట్టు వద్ద గల అమ్మవారి ఆలయం వద్ద వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. ఎండ తీవ్రతకు మజ్జిగ, శీతలపానీయాలు భక్తులకు అందజేశారు. అమ్మవారిని మకర తోరణం, వెండి కిరీటం, ఏడువారాల నగలతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమల అనుపు మహోత్సవం ఘనంగా జరిగింది.